
సాక్షి
పార్వతీపురం మన్యం

గురువారం । 7 । మార్చి । 2024



చదువుల లోగిళ్లు..

రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. విద్యాలయాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతోంది.

-8లో

LIFE LINE

నిరుద్యోగులకు టోకరా..

గల్ఫ్ దేశాలకు పంపిస్తామని ఆశ చూపారు. వేల రూపాయలు వసూలు చేశారు. నిరుద్యోగులకు టోకరా పెటారు.

-8లో



విజ్ఞానం పెంపొందించేలా శిక్షణ

శాస్త్ర పరిశోధన పరిజ్ఞాన విస్తరణలో సంప్రదాయ విజ్ఞానాన్ని సమగ్రపరచాలని, ఆ దిశగా శిక్షణ అందించాలని ఢిల్లీ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ పీసీజోషి అన్నారు.

-8లో

రైతన్నకు ఆపన్న హస్తం

- రైతుల ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ జమ
- 256 మంది రైతులకు రూ.14.75 లక్షల పరిహారం
- కష్టకాలంలో ఆదుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, పార్వతీపురం మన్యం/పార్వతీపురం:

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆదినుంచీ రైతుల పక్షాన నిలుస్తోంది. ఎండనక, వాననకు పొలంలో శ్రమిస్తూ పంటలు సాగుచేసే రైతన్నకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. పంట పెట్టుబడి అందించడంతోపాటు విపత్తుల వేళ ఆదుకుంటోంది. సాగుకు భరోసా కల్పిస్తోంది. ఏ సీజన్ పంట నష్టపరిహారాన్ని అదే సీజన్‌లో రైతుల ఖాతాలకు జమచేస్తోంది. ఇందులో భాగంగానే ఖరీఫ్-2023లో వర్షాభావం, డిసెంబర్ నెలలో సంభవించిన మిచాంగ్ తుపానుకు పార్వతీపురం మన్యం జిల్లాలో పంట నష్టపోయిన 259 మంది రైతులకు రూ.14.75 లక్షల పరిహారాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మంజూరు చేసింది. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం బటన్ నొక్కి రైతుల ఖాతాలకు పెట్టుబడి రాయితీ నిధులను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి జమచేశారు. కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరం నుంచి ఇన్‌చార్జి జేసీ విష్ణుచరణ్, రైతులు వర్చువల్‌గా తిలకించారు. జిల్లాలో 60 గ్రామాలకు చెందిన 259మంది రైతులు 88.77 హెక్టార్లలో పండించిన వరి, మొక్క జొన్న, రాగి పంటలు నష్టపోయినందుకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద మంజూరైన రూ.14.75 లక్షల పరిహారం అందజేశారు. నమూనా చెక్కును రైతులకు ఇన్‌చార్జి జేసీ అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయాధికారి ఎ.నిర్మల గౌరీ, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు సకాలంలో పరిహారం నేరుగా తమ ఖాతాలకే జమచేయడం చాలా సంతోషంగా ఉందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఇన్‌పుట్ సబ్సిడీ మెగా చెక్కును అందజేస్తున్న ఇన్‌చార్జ్ జేసీ విష్ణుచరణ్



మాది సాలూరు మండలం బోరబంద. మాకు చెందిన 0.724 హెక్టార్లలో వరి పంట నష్టపోయాం. పరిహారం ఆలస్యంగా చేయకుండా ప్రభుత్వం రూ.14,096 జమ చేసింది. దీని వల్ల మాకు పంట నష్టపోయామన్న బాధ కలగలేదు. దీంతోపాటు మాకు కావాల్సిన అన్ని సేవలనూ ప్రభుత్వం గ్రామంలోనే అందిస్తోంది.

– కె.అప్పలస్వామి, బోరబంద, సాలూరు మండలం

ఇన్‌పుట్ సబ్సిడీ ఇలా..				
నియోజకవర్గం	గ్రామాలు	రైతులు	పంట నష్టం (హెక్టార్లలో)	పరిహారం (రూ.లక్షల్లో)
పార్వతీపురం	03	22	5.83	0.991
కురుపాం	07	20	7.437	1.264
సాలూరు	49	216	75	12.43
పాలకొండ	01	02	0.408	0.069

వరి పంట నష్టపోయా..



మాది పాచిపెంట మండలం. 0.85 ఎకరాల విస్తీర్ణంలో వరిపంట నష్టపోయా. పెట్టిన పెట్టుబడైనా వస్తుందో లేదోనని ఆందోళన చెందాను. ప్రభుత్వం ఆదుకుంది. పరిహారం డబ్బులు రూ.5,780 ఈ రోజు జమ అయ్యాయి. ఈ ప్రభుత్వానికి కృతజ్ఞతలు. మాకు కావాల్సిన అన్ని సేవలనూ ప్రభుత్వం మా ముంగిటే అందిస్తోంది.

– బొట్ట కృష్ణారావు, మోసూరు, పాచిపెంట మండలం

ప్రభుత్వం సకాలంలో ఆదుకుంది..



పంట నష్టపోయామన్న ఆవేదన అప్పట్లో కలిగింది. కానీ, ఇప్పుడు ఆ బాధ లేదు. ప్రభుత్వం మేము పెట్టిన పెట్టుబడులను తిరిగి ఇచ్చేసింది. ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. పరిహారంగా నాకు రూ.14,096 అందింది.

– బవిరెడ్డి సీతంనాయుడు, బోరబంద, సాలూరు మండలం

రూ.10 వేలు వచ్చింది...

మాది మోసూరు గ్రామం. తుపాను కారణంగా 1.5 ఎకరాల్లో వరి పంట నష్టపోయాను. అప్పట్లో వ్యవసాయాధికారులు పంట నష్టం అంచనా వేసి వెళ్లారు. వెంటనే నిధులు జమ అవుతాయని అనుకోలేదు. ఈ రోజు నా బ్యాంకు ఖాతాకు రూ.10,200 జమైంది. మాకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సైతం రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుతున్నాయి. రైతుకు భరోసా లభిస్తోంది. సాగుపై మక్కువ పెరిగింది. గిట్టుబాటు ధర కల్పనతో రైతుకు ఆదాయం మెరుగుపడింది.

– కలిశెట్టి సన్యాసినాయుడు, మోసూరు, పాచిపెంట

సకాలంలో పరిహారం



బోరబంద సచివాలయం పరిధిలో 21 మంది రైతులకు చెందిన ఆరు హెక్టార్లలో వరి పంట దెబ్బతింది. దానికి గానూ రూ.85,680 ఇన్‌పుట్ సబ్సిడీగా అందించాం. నష్టపోయిన పంటలకు సకాలంలో పరిహారం అందించడం వల్ల రైతులు చాలా సంతోషంగా ఉన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలపైనా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

– బి.దుర్గ, బోరబంద, సాలూరు మండలం

న్యూస్‌రీల్

భారత ప్రామాణికతలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ

పార్వతీపురంటౌన్: వినియోగదారులకు రక్షణ, వినియోగం, ప్రజాపంపిణీ వ్యవస్థలో ప్రామాణికతలపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు అవగాహన అవసరమని జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సెన్సిటైజేషన్ వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. వస్తువుల వినియోగం, నాణ్యతపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. హాల్‌మార్కు ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ హైదరాబాద్ సౌత్ జోన్ జాయింట్ డైరెక్టర్ సుజాత, ఎంపీడీఓ జావెద్, డీఎల్‌పీఓ ఎం. నాగభూషణ, డీపీఆర్‌సీ ట్రైనింగ్ మేనేజర్ ఎ.దేవుడు, ఆర్పీలు ఎ.గణపతి, ఎమ్.రఫీ, వెంకటరమణ పాల్గొన్నారు.

రూ.3.35 లక్షల టన్నుల చెరకు క్రషింగ్ పూర్తి

రేగిడి: మండలంలోని సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో ఇప్పటి వరకు 3.35లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ పూర్తయినట్టు అసోసియేటివ్ వైస్ ప్రెసిడెంట్ పట్టాభిరామిరెడ్డి బుధవారం తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల రైతులు సాగుచేసిన చెరకును క్రషింగ్ చేస్తున్నట్టు వివరించారు. ప్రతిరోజు 3,200 టన్నుల చెరకు క్రషింగ్ జరుగుతోందన్నారు.రైతులకు సకాలంలో చెరకు బిల్లులు చెల్లిస్తున్నామని తెలిపారు.

మాదలంగి పరిసరాల్లో గజరాజుల సంచారం



మాదలంగి సమీపంలో సంచరిస్తున్న ఏనుగులు

కొమరాడ: మండలంలోని మాదలంగి, వన్నాం గ్రామ పరిసరాల్లో గజరాజులు బుధవారం సంచరించాయి. చేతికందొచ్చిన జొన్న పంటలో సంచరిస్తుండడంతో నష్టం వాటిల్లుతోందని రైతులు వాపోతున్నారు. ఏనుగులు సంచరించే ప్రాంతానికి రైతులు రాత్రిపూట వెళ్లొద్దని అటవీశాఖ సిబ్బంది హెచ్చరికలు జారీ చేశారు.

అభ్యంతరాలుంటే చెప్పండి

- ఇన్‌చార్జి జేసీ విష్ణుచరణ్



రాజకీయపార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జేసీ విష్ణుచరణ్

పార్వతీపురం: ఫారం-6, 7, 8లపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల సంబంధిత అంశాలపై బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మీడియా నివేదికలు, ఫిర్యాదుల ఆధారంగా విచారణ జరిపి 1128 ఓట్లు తొలగించామన్నారు. వాటిలో 257 మంది చనిపోయినవారివి, 306 మంది శాశ్వత వలసవెళ్లిన వారి ఓట్లు ఉన్నాయన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి జి. కేశవనాయుడు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాసరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నివారణకే 'ప్రిజమ్'

భామిని: మాతాశిశు మరణాల నివారణే 'ప్రిజమ్-10' ప్రధాన ఉద్దేశమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు తెలిపారు. భామిని మండలం నల్లరాయిగూడలో బాలేరు వైద్యాధికారి డాక్టర్ దీపికారాణి, సీడీపీఓ శాంతి భవానీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రిజమ్-10 కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గర్భిణులకు నెలనెలా వైద్యపరీక్షలతో పాటు రక్త హీనత నివారణకు పౌష్టికాహారం, మందులు అందజేయాలని సూచించారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆకు కూరలు, బెల్లం వంటకాలు, పండ్లు తినాలన్నారు. అనంతరం బాలేరు, బత్తిలి పీహెచ్‌సీలను సందర్శించి, రికార్డులు పరిశీలించారు. ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ కె.అప్పారావు, ఐసీడీఎస్ ఎస్‌ఓ జ్యోతిలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో యువతది కీలకపాత్ర



సమావేశంలోమాట్లాడుతున్న నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి వెంకట ఉజ్వల్

పార్వతీపురం: ప్రజాస్వామ్య వ్యవస్థలో యువతది కీలకపాత్ర అని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె.వెంకటఉజ్వల్ అన్నారు. ఎమ్మార్ నగరం పాలిటెక్నిక్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో బుధవారం యూత్ పార్లమెంట్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టు యువత అని పేర్కొన్నారు. సమాజసేవకు యువత ముందు కురావాలని పిలుపునిచ్చారు. యువత తమ గ్రామాన్ని, తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో అడుగులు ముందుకు వేయాలని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలపాత్ర అమోఘం అన్నారు. ఎన్నికలలో యువత కీలక పాత్ర పోషించాలని కోరారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువత ఓటరుగా నమోదు కావాలని, ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు. ఓటు వజ్రాయుధం వంటిదన్నారు. ఓటు హక్కు వినియోగించు కోవడం ద్వారా నవ సమాజానికి నాంది పలకవచ్చని చెప్పారు. ఓటు సద్వినియోగం చేసుకుని సమాజహితానికి కృషిచేసే వారిని గెలిపించుకోవచ్చని తెలిపారు. ఓటు హక్కు వచ్చిందంటే దేశం కోసం ఆలోచించే శక్తి ఉందన్న విషయం గుర్తించాలన్నారు.

ఓటింగ్ సమయంలో వృద్ధులు, దివ్యాంగులకు యువత సహకరించాలని కోరారు. చట్ట సభలపై యువతకు స్పష్టమైన అవగాహన అవసరమన్న ఉద్దేశంతో యూత్ పార్లమెంట్ నిర్వహించినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి లోచర్ల రమేష్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.విలియంక్యారీ, మండల ఉపాధ్యక్షుడు బి.రవి కుమార్, సర్పంచ్ వి.త్రినాథరావు, ఈసీఈ విభాగాధిపతి జి.ఉదయ భాస్కర్, అధ్యాపకులు పి.అనూరాధ, అమ్మ యూత్ క్లబ్ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల అబద్ధపు హామీలు నమ్మొద్దు



మడవలస గ్రామ బీటీరోడ్డు శిలాఫలం ఆవిష్కరిస్తున్న మంత్రి రాజన్నదొర

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర
- 2014 ఎన్నికల్లో 600 హామీలిచ్చిన చంద్రబాబు ఒక్కటీ నెరవేర్చని వైనం
- గిరిజనాభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కృషి
- బ్యాంకు పుస్తకాలు, స్టేట్‌మెంట్ చూసుకుంటే లబ్ధి తెలుస్తుంది..
- పలు సీసీరోడ్లు, కాలువలు, పైపు కల్వర్టులు, బీటీ రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన

మక్కువ: ఎన్నికల వేళ టీడీపీ నాయకులు చెప్పే అబద్ధపు మాటలు, ఇచ్చిన హామీలను నమ్మవద్దని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర గిరిజనులకు హితవుపలికారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ కృషితో గిరిజన గ్రామాల అభివృద్ధి, గిరిజనులకు ఆర్థిక సంక్షేమం సమకూరిందన్న విషయం గుర్తించాలన్నారు. లబ్ధిదారుల బ్యాంకు పాస్‌పుస్తకాల స్టేట్‌మెంట్ చూస్తే వివిధ సంక్షేమ పథకాల కింద అందిన లబ్ధి తెలుస్తుందన్నారు. మక్కువ మండలం మర్రివానివలస గ్రామంలో రూ.30 లక్షల వ్యయంతో సీసీరోడ్లు, పైపులైన్ కల్వర్టుల నిర్మాణానికి ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం దబ్బగెడ్డ పంచాయతీ మడవలస గ్రామానికి రూ.1.60లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గడగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతీ గ్రామంలో ఇంటింటికీ వెళ్లామని, ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందాయా?లేదా? అన్నది ఆరా తీశామన్నారు. అవసరమైన చోటసీసీరోడ్లు, కాలువలు, పైపు కల్వర్టులు, తాగునీరు, బీటీ రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరుచేసిందన్నారు. మండలంలోని పెదగైశీల వద్ద రూ.60లక్షలు, కాకువానివలస వద్ద రూ.45లక్షలు, మర్రివానివలసలో రూ.30లక్షలు, కేంద్రుక గైశీలలో రూ.38లక్షలు మొత్తంగా 1.73 లక్షలతో సీసీరోడ్లు, పైపుకల్వర్టులు నిర్మిస్తామని చెప్పారు. పార్వతీపురం మండలం అడారు గ్రామం ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి, మడవలస గ్రామం వరకు బీటీరోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.కోటి 60లక్షలు మంజూరు చేసిందన్నారు. 2014లో చంద్రబాబునాయుడు మహిళల డ్వాక్రా రుణాలు, రైతుల రుణాలు మాఫీ చేస్తామని మోసం చేశారన్నారు. నిరుద్యోగ యువతకు బాబువస్తే జాబు ఇస్తానని చెప్పి నట్టేమంచేశారన్నారు. సంక్షేమ, అభివృద్ధి పాలనకు మరోసారి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మెల్లిక రాములమ్మ, సీదరపు లక్ష్మి, ఎంపీపీ మర్రి పారమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు మండంగి భాగ్యలక్ష్మి, సాలూరు మండలం నాయకులు దండి శ్రీను, సువ్వాడ రామకృష్ణ, డీఈ మణిరాజ్, జేఈ సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి రాజన్నదొర

మహిళల ఆర్థిక స్వావలంబనకు

చేయూత



- 45-60 ఏళ్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ పేద మహిళలకు అండ

- ఏటా రూ.18,750 ఆర్థిక ప్రయోజనం
- నాలుగు విడతల్లో రూ.75వేల సాయం
- నేడు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయనున్న ప్రభుత్వం
- జిల్లాలో డీఆర్‌డీఏ పరిధిలోని 65,533 మంది లబ్ధిదారులకు రూ.122.80 కోట్లు
- మెప్మా పరిధిలో 7,321 మంది లబ్ధిదారులకు రూ.13.08 కోట్ల లబ్ధి


పార్వతీపురంటౌన్:

మాట ఇస్తే నెరవేర్చడం... ప్రతీ ఒక్కరికీ మంచి చేయాలన్న తపన, తాపత్రయం కలిగిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి. అందుకే.. ఎన్నికలు, ప్రజా సంకల్పయాత్ర సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ ఇంచుమించుగా నెరవేర్చారు. పాలనలో కొత్త చరితను సృష్టించారు. బడుగు, బలహీన వర్గాల ఆర్థికోన్నతే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలుచేశారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ పైసా అవినీతిలేకుండా ప్రభుత్వ సాయాన్ని అందేలా చూశారు. అదే కోవలో వెనుకబడిన కులాల మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా వైఎస్సార్ చేయూత పథకం కింట ఏటా ఆర్థిక సాయం అందజేస్తున్నారు. పథకం నాలుగో విడత నిధులను అమలాపురం వేదికగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గురువారం విడుదల చేయనున్నారు. ఒక్కో లబ్ధిదారు ఖాతాలో రూ. 18,750 చొప్పున జమచేయనున్నారు. పథకం కింద పార్వతీపురం మన్యం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన 65,533 మంది లబ్ధిదారులకు రూ.122.80 కోట్లు, పట్టణ ప్రాంతంలో మెప్మా పరిధిలోని 7,321 మంది లబ్ధిదారులకు రూ.13.08 కోట్లు ఆర్థిక సాయం అందనుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సామాజిక వర్గాలకు చెందిన 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపు పేదింటి మహిళలకు ఏడాదికి రూ.18,750 చొప్పున నాలుగేళ్లలో రూ.75,000 ఆర్థిక సాయాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమచేస్తామని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన విషయం విదితమే. సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఏడాదికాలానికే వైఎస్సార్ చేయూత పథకం అమలుకు శ్రీకారం చుట్టారు. గత మూడేళ్లలో మూడు విడతలుగా ఒక్కో లబ్ధిదారుకి మొత్తం రూ.56,250 చొప్పున సాయాన్ని అందజేశారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయం వారి కుటుంబాలకు కొండంత చేయూతను అందించింది. నాలుగో విడత సాయాన్ని తంచన్‌గా లబ్ధిదారులకు అందజేసేందుకు సర్వం సిద్ధం చేశారు. చేయూత పథకానికి కొత్తగా అర్హులను గుర్తించేందుకు దరఖాస్తులు స్వీకరించారు. కొత్త వారి పేర్లు నమోదు చేసుకుని ఎంపీడీఓల ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వెరిఫికేషన్ పూర్తి చేశారు. తుది వెరిఫికేషన్ పూర్తి చేసి పాత లబ్ధిదారులతో పాటు కొత్తగా అర్హత పొందిన వారి పేర్లతో జాబితాలను సిద్ధం చేశారు. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలో 72,854 మందికి రూ.136.60 కోట్లు వైఎస్సార్ చేయూత సాయం అందనుంది.

కార్పొరేషన్‌ల వారీగా లబ్ధిదారులు ఇలా..	
కార్పొరేషన్	లబ్ధిదారులు
బీసీ–ఎ	6,677
బీసీ–బి	4,680
బీసీ–సి	33,442
బీసీ–డి	120
ఎస్సీ	9,727
ఎస్టీ	18,175
మైనారిటీ	20
క్రిస్టియన్	13
మొత్తం	72,854

జిల్లాలో మండలాల వారీగా లబ్ధి ఇలా...		
మండలం	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి (రూ.కోట్లలో)
పార్వతీపురం రూరల్	5,562	10.43
పార్వతీపురం అర్బన్	2,734	5.13
సీతానగరం	5,430	10.18
బలిజిపేట	5,655	10.60
సాలూరు రూరల్	4,092	7.67
సాలూరు అర్బన్	2,767	5.19
పాచిపెంట	2,997	5.62
మక్కువ	4,415	8.28
కురుపాం	3,357	6.29
జియ్యమ్మవలస	4,635	8.69
గుమ్మలక్ష్మీపురం	2,970	5.57
గరుగుబిల్లి	4,115	7.72
కొమరాడ	4,611	8.65
పాలకొండ రూరల్	4,156	7.79
పాలకొండ అర్బన్	1860	3.49
సీతంపేట	4,374	8.20
భామిని	3,576	6.71
వీరఘట్టం	5,548	10.40

వ్యాపారాభివృద్ధికి ఉపయోగించుకోవాలి



వైఎస్సార్ చేయూత పథకం ద్వారా లబ్ధిపొందిన లబ్ధిదారులు వ్యాపారాన్ని పెంచుకుని ఆర్థికంగా ఎదగాలి. జిల్లా వ్యాప్తంగా మెప్మా పరిధిలో 7,321 మంది లబ్ధిదారులకు రూ.13.08 కోట్లు అందజేయనున్నారు. లబ్ధిదారులు చేస్తున్న వ్యాపారాలకు మెప్మా ద్వారా చేయూత అందిస్తున్నాం. వారికి మెలకువలు నేర్పించి వ్యాపారాభివృద్ధికి సహకరిస్తున్నాం.

– బి.సుధాకర్‌రావు, ఉమ్మడి విజయనగరం జిల్లా మెప్మా ఇన్‌చార్జి

అర్హులందరికీ చేయూత



ఈ ఏడాది గత మూడేళ్ల కంటే లబ్ధిదారుల సంఖ్య పెరిగింది. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులందరికీ ఈ ఏడాది చేయూత పథకాన్ని వర్తింపజేశాం. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో వైఎస్సార్ చేయూత కింద లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అవుతుంది. లబ్ధిదారులు వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకుని జీవన ప్రమాణాలను మెరుగు పరచుకోవాలి.

– వై.సత్యంనాయుడు, డీఆర్‌డీఏ పీడీ, పార్వతీపురం మన్యం

క్లుప్తంగా

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

పార్వతీపురం టౌన్: పాలిసెట్‌కు పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.వి లియం క్యారీ తెలిపారు. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ – రాష్ట్ర సాంకేతిక విద్య శిక్షణా మండలి రూపొందించిన 'పాలిటెక్నిక్ చదవటం ఉత్తమం, ఎందువలన అంటే' పోస్టర్‌ను ఎమ్మార్‌నగరం పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి లోచర్ల రమేష్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 10వ తరగతి ఉత్తీర్ణత తరువాత సాంకేతిక విద్యను అభ్యసించడం సులువైన, తెలివైన మార్గం అన్నారు. పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులకు గణనీయంగా ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. పాలిసెట్ ద్వారా అడ్మిట్ అయిన అర్హులైన అందరికి ఫీజు రీయంబర్స్ మెంట్, వసతి సౌకర్యాలు, ఉపకార వేతనాలు సదుపాయం ఉంటుందన్నారు. ఏపిసీటీఈ మార్గదర్శకంతో ఆధునిక టెక్నాలజీలకు అనుగుణంగా ఇండస్ట్రీ 4.0 కోర్సుల రూపకల్పన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె వెంకట ఉజ్వల్, ఈసీఈ విభాగాధిపతి జి.ఉదయ భాస్కర్, అధ్యాపకులు పి.అనురాధ, మండల ఉపాధ్యక్షులు బి.రవికుమార్, సర్పంచ్ వి.త్రినాథ రావు, అమ్మ యూత్ క్లబ్ అధ్యక్షుడు పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జె.కె.గుమ్మడలో జీడి, మామిడి తోటలు దగ్ధం



జీడి, మామిడి తోటలో చెలరేగిన మంటలు

వంగర: మండల పరిధి వి.వి.ఆర్.పేట పంచాయతీ జె.కె.గుమ్మడలో బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామ సమీపంలోని దాలినాయుడు తోట వద్ద 12 మంది రైతులకు చెందిన 10 ఎకరాల జీడి, మామిడి తోటలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో జక్కు గణపతి, అల్లారపు తిరుపతి, డొంకాడ రమణమ్మ, కొల్లి శివున్నాయుడు, మరిశర్ల సత్యం నాయుడుతో పాటు మరి కొంతమంది రైతులకు చెందిన తోటలు దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని దుండగులు నిప్పంటించి ఈ ఘటనకు పాల్పడ్డారని రైతులు చెబుతున్నారు. దీనిపై వంగర పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీస్తున్నారు. గ్రామస్తులందరూ సమష్టిగా మంటలను అదుపు చేశారు.

జూదరుల నుంచి రూ.1.78లక్షల నగదు స్వాధీనం

కొత్తవలస: మండలంలోని మన్నిపాలెం గ్రామం సమీపంలో గల దారపైడితల్లిమ్మ వారి గుడి సమీపంలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సీఐ ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీస్‌లు బుధవారం సాయంత్రం దాడులు చేశారు. పేకాట ఆడుతున్న 18 మంది జూదరులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1,78,300 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త

బొబ్బిలి: భార్యపై అనుమానంతో ఇనుప రాడ్‌తో విచక్షణారహితంగా తలపై భర్త మోదడంతో ఆస్పత్రిలో చేరి అనంతరం మరణించింది. సీఐ ఎం.నాగేశ్వరరావు తెలిపిన వివరాలు.. మండలంలోని కమ్మవలసకు చెందిన పాతినవలస తవిటినాయుడు, లక్ష్మిలకు జ్యోతిప్రసాద్(15), యశ్వంత్(12) పిల్లలున్నారు. తరచూ భార్యపై అనుమానం వ్యక్తం చేస్తూ గొడవ పడినట్టుగానే గత నెల 20న కూడా గొడవ జరగడంతో భార్య తలపై భర్త ఇనుప రాడ్‌తో కొట్టాడు. తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరిన లక్ష్మి మృతి చెందింది. కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో హాజరుపర్చారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని క్షతగాత్రుడు

సీతానగరం: మండలంలోని అప్పయ్యపేట – సీతానగరం గ్రామాల మధ్య బుధవారం రాత్రి గుర్తు (45) తెలియని వ్యక్తి గాయాల పాలైన వైనమిది. 108 సిబ్బంది అందించిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం రాత్రి 8 గంటల సమయంలో పాత రైల్వే గేట్ సమీపంలో గాయాల పాలైన వ్యక్తి ఉన్నట్లు సెల్ ఫోన్ల ద్వారా సమాచారం వచ్చింది. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న సమయానికే రైలు పట్టాలపై ఎడమ కాలు విరిగి మతితప్పి ఓ వ్యక్తి ఉన్నట్టు గుర్తించారు. దీంతో క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రిలో చేర్పించినట్లు తెలిపారు. క్షతగాత్రుడి వివరాలు తెలియాల్సి ఉంది.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹ 240

చదువుల లోగిళ్లు... గిరిజన సంక్షేమ ఆశ్రమాలు



సుందరంగా హద్దుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల

- కార్పొరేట్‌ను తలదన్నేలా చదువులు
- ఆధునీకరించిన వసతులు
- నాడు – నేడు తొలి విడతలో 47 ఆశ్రమాలకు రూ.21 కోట్లు
- రెండో విడతలో 37 ప్రాథమిక పాఠశాలలకు రూ.34 కోట్లతో వసతులు
- పెరిగిన ప్రవేశాలు



క్రమశిక్షణతో భోజనాలు చేస్తున్న బాలికలు

సీతంపేట: రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గిరిజన సంక్షేమ విద్యకు పెద్దపీట వేస్తుంది. బైజూస్ కంటెంట్‌తో చదువులు ముందుకు సాగుతున్నాయి. కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక వసతులు కలిపిస్తుంది. మనబడి నాడు – నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. ఆట, పాటలకు అనువుగా ఉండేలా ఆట స్థలాలు, పరికరాలు ఉండడం, మౌలిక వసతుల కల్పనలో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణం, మినరల్ మంచినీటి సదుపాయాలు, ఆకట్టుకునే తరగతి గదులు వాటిలో ఫ్యాన్లు, లైట్లు, బెంచీలు ఇలా ఎన్నో సౌకర్యాలు కల్పించడంతో విద్యార్థులు పాఠశాలల్లో చేరడానికి ముందుకు వస్తున్నారు. ఒకప్పుడు తల్లిదండ్రులతో కొండపోడు వ్యవసాయాలకు తోడు వెళ్లే పిల్లలు ఇప్పుడు బడిబాట పట్టారు. ఉల్లాసంగా పాఠశాలలకు వెళ్తున్నారు. ఆశ్రమ పాఠశాలల్లో ఉంటూ చదువుతున్నారు. మూడు పూటల భోజన, వసతి, వైద్య సౌకర్యాలు వంటివి పూర్తి స్థాయిలో అందుతున్నాయి. ఈ ఏడాది ప్రవేశాలకు



సీతంపేట బాలికల ఆశ్రమపాఠశాల

మంచి డిమాండ్ ఏర్పడింది. సీతంపేట గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో 2022 – 23 విద్యా సంవత్సరంలో 16,775 మంది విద్యార్థులు చదివితే 2023 – 24లో 20,,265 మంది విద్యార్థులు చదువుతున్నారు. దాదాపు 3,490 మంది విద్యార్థుల అడ్మిషన్లు పెరిగాయి. తొలి విడతలో 47 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో రూ.21 కోట్లతో అభివృద్ధి పనులు చేశారు. రెండో విడతలో రూ.34 కోట్లతో 37 గిరిజన ప్రాథమిక పాఠశాలలు, మరో 5 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు మౌలిక



బై జూస్ ట్యాబ్‌ను వినియోగించుకుంటూ చదువుతున్న బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు

వసతులు కల్పించారు. మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు ప్రతీ తరగతి గదిలో విద్యుత్ సౌకర్యంతో ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్ల ఏర్పాటు, తాగునీటి కల్పన, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బందికి అవసరమైన ఫర్నిచర్, పాఠశాల భవనం, ప్రహరీలకు నాణ్యమైన పెయింటింగ్, పాఠశాలలో ప్రస్తుతం ఉన్న భవనానికి పూర్తి స్థాయి మరమ్మతులు, బ్లాక్ బోర్డుల ఏర్పాటు అదనపు గదుల నిర్మాణం వంటివి చేపట్టారు. దీంతో ఈ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మారిపోయాయి.

గిరిజన విద్యకు పెద్దపీట



గత టీడీపీ ప్రభుత్వం హయాంలో కేవలం మరమ్మతులు పేరుతో రంగులు వేసి నిధులు కొల్లగొట్టారు. జగనన్న ప్రభుత్వంలో గిరిజన విద్యకు పెద్దపీట వేశారు. అన్ని పాఠశాలలకు పూర్తి మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకున్నాం. తల్లిదండ్రులు, విద్యార్థులు ఎంతో ఆనందంగా ఉన్నారు.

– విశ్వాసరాయి కళావతి, పాలకొండ ఎమ్మెల్యే

అన్ని పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు



అన్ని పాఠశాలల్లో పూర్తి స్థాయిలో సబ్జెక్టు టీచర్లు నియమించాం. ఖాళీలున్నచోట సీఆర్‌టీలను నియమించాం. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. మంచి చదువులను అందించి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాం.

– అన్నదొర, గిరిజన సంక్షేమశాఖ డీడీ

ప్రవేశాలు పెరిగాయి



గతంతో పోలిస్తే పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగాయి. మా పిల్లలకు సీట్లు ఇప్పించాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలకు వస్తున్నారు. ఈ క్రమంలో ప్రతీ విద్యార్థికి ఆయా పాఠశాలల్లో ఖాళీలను అనుసరించి సీట్లు కేటాయిస్తున్నాం.

– ఎ.లిల్లీరాణి, డిప్యూటీ ఈఓ, సీతంపేట

జగన్ మామకు రుణపడి ఉంటాం



జగన్ మామకు రుణపడి ఉంటాం. పాఠశాలల్లో మాకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇక్కడ ఉండి చక్కగా చదువుకుంటున్నాం. బై జూస్ పాఠాలు ఎంతో అర్థవంతంగా ఉన్నాయి. రోజూ ట్యాబ్‌లు వినియోగించుకుంటున్నాం. ప్రత్యేక సెలవుల్లో తప్ప ఎప్పుడు ఇంటికి వెళ్లకుండా పాఠశాలల్లో ఉండి చదువు కొనసాగిస్తున్నాం.

– ఎస్.ఝాన్సీరాణి, 9వ తరగతి

హోటల్ రంగాన్ని పరిశ్రమ రంగంగా గుర్తించాలి

- రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీ స్వామి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీ స్వామి

విజయనగరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హోటల్ రంగాన్ని పరిశ్రమ రంగంగా గుర్తించాలని... తద్వారా వినియోగదారులకు సంతృప్తికరమైన సేవలు అందించగలమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీ స్వామి కోరారు. స్థానిక ఎస్‌వీఎన్ లేక్ పేలస్ హోటల్‌లో రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ కార్య నిర్వాహక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా లక్షల మందికి జీవనోపాధి కల్పిస్తున్న హోటల్స్ రంగం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటుందని అవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విధిస్తున్న జీఎస్టీ 12 శాతం ఉందని దాని భారం వినియోగదారుల మీద పడుతుందని... దానిని 5 శాతం వరకు తగ్గిస్తే... వ్యాపారులకు, వినియోగదారులకు వెసులుబాటు ఉంటుందని తెలిపారు. ఇప్పటికే మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడులో ఈ విధానం అమలు అవుతుందని, దీని వల్ల రూ.20లక్షల కోట్లు రాయితీలు వస్తాయని తెలియజేశారు. తద్వారా చిన్న వ్యాపారులు కూడా అభివృద్ధి చెందుతారని వివరించారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి కూడా అవకాశం వస్తుందని తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రఘువీర్ శెనాయ్, జాయింట్ సెక్రటరీ గుడిశా శివకుమార్, పూర్ణచందర్

రివర్స్ టెండరింగ్‌తోనే ప్రజాధనం ఆదా

- టిడ్కో ఇళ్లకు రూ.3.71 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్
- ఎమ్మెల్యే శంబంగి, టిడ్కో చైర్మన్ జమ్మాన



సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి, టిడ్కో చైర్మన్ జమ్మాన

బొబ్బిలి: టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు వారి అనుయాయులకు కట్టబెట్టిన భారీ కాంట్రాక్టులను వైఎస్సార్ సీపీ వచ్చిన తరువాత రివర్స్ టెండరింగ్ వేయడంతో భారీ ఎత్తున ప్రజాధనం ఆదా అయిందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. రామన్నదొరవలసలో టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీల విద్యుత్ సౌకర్యం కోసం రూ.3.71 కోట్లతో ఏర్పాటు చేసిన ఈపీడీసీఎల్ సబ్ స్టేషన్‌ను ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఛార్జ్ చేసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బొబ్బిలిలో చివరి దశకు వచ్చిన 1680 ఇళ్లను పూర్తి సౌకర్యాలు కల్పించి త్వరలోనే అప్పగిస్తామన్నారు. టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 89 ప్రాజెక్టులలో ఇప్పటికే 1.25లక్షల ఇళ్లను అప్పగించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టిడ్కో ఇళ్ల వద్ద రూ.451 కోట్లతో రెండు దఫాలుగా నిధులు వెచ్చించి సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నామన్నారు. జిల్లాలోని గుమడాం, సోనియానగర్, సాలూరు, బొబ్బిలి, సారిపల్లి ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు నాణ్యతతో సాగుతున్నాయన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, ఈపీడీసీఎల్ ఎస్‌ఈ ఎం.లక్ష్మణరావు, ఈఈ ఎ.అనంతరావు, కన్‌స్ట్రక్షన్స్ ఈఈ పి.త్రినాథరావు, డీఈఈ ఎం.శ్రీనివాసరావు, ఏఈ బి.సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకులు శంబంగి వేణుగోపాల నాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళీ కృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ తెంటు పార్వతి పాల్గొన్నారు.

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బలపడాలి

- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డా.జయచంద్రనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు జయచంద్రనాయుడు

పార్వతీపురం: ఇండియన్ మెడికల్ అసోషియేషన్‌ను బలపరచాల్సిన అవసరం ఉందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా.జయ చంద్ర నాయుడు అన్నారు. బుధవారం సాయంత్రం పార్వతీపురం మన్యం జిల్లాను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు డాక్టర్లు, ప్రభుత్వ డాక్టర్లు, జూనియర్ డాక్టర్లు సమస్యలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. డాక్టర్లు సమస్యలను రాష్ట్ర వ్యాప్తంగా తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులకు ఎంఎల్‌సీ ఎలా కేటాయించారో, వైద్యులకు కూడా ఒక ఎంఎల్‌సీ కేటాయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఆస్పత్రులను నిర్వహించాలంటే లైసెన్సులు, రిజిస్ట్రేషన్‌లు చేయాలని, ఈ లైసెన్సులన్నీ ఒకే సింగిల్ విండో విధానంలో అమలు చేస్తే ఎంతో వ్యయభారం, సమయభావం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా ఐఎంఏ అధ్యక్షుడు డా. యాళ్ళ వివేక్, వై.పద్మజ, డా.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

వాహనం బోల్తాపడి బాలుడి మృతి

అనంతగిరి(అల్లూరి జిల్లా): మండలంలోని లంగుపర్తి గిరిజన సంక్షేమ బాలురు పాఠశాల సమీపంలోని బుధవారం బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఎస్.కోట ప్రాంతానికి చెందిన బాలుడు మృతి చెందాడు. లంగుపర్తిలో మహాశివ రాత్రి జాతర సందర్భంగా ఎస్.కోట ప్రాంతానికి చెందిన సౌండ్ సిస్టం, స్టేజ్‌ను బొలెరో వాహనంలో తీసుకువచ్చారు. పాఠశాల సమీపంలోని వాహనం అదుపుతప్పి వెనుకకు జారడంతో బోల్తా పడింది. వాహనంలో ఉన్న ఎస్.కోట ప్రాంతానికి చెందిన పవన్‌కల్యాణ్(15) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని పట్టణాల్లో రైతు బజార్‌లు ఏర్పాటు

- మార్కెటింగ్ శాఖ జేడీ సుధాకర్

బొబ్బిలి: ఉత్తరాంధ్రలోని అన్ని పట్టణాల్లోనూ రైతు బజార్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని మార్కెటింగ్ శాఖ జేడీ పి.సుధాకర్ అన్నారు. బొబ్బిలి ఏఎంసీని బుధవారం సందర్శించిన ఆయన ఇక్కడి నుంచే రాష్ట్ర స్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ తన పరిధిలో 61 కమిటీలున్నాయన్నారు. ఈ కమిటీల నుంచి రూ.163 కోట్ల పన్నుల వసూలు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటి వరకూ రూ.109 కోట్లను వసూలు చేసినట్టు చెప్పారు. లక్ష్యాన్ని మార్చి నెలాఖరుకు చేరుకుంటామన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు రైతు బజార్ల కోసం స్థలాలు పరిశీలిస్తున్నట్టు చెప్పారు. వ్యాపార వాణిజ్య వర్గాలకు ఈ ఫార్మింగ్‌పై చైతన్యం కల్పిస్తామని చెప్పారు. ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, ఏడీ బి.రవికిరణ్, కార్యదర్శి కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

విజ్ఞానం పెంపొందించేలా శిక్షణ

- శాస్త్ర పరిజ్ఞాన విస్తరణ సాంప్రదాయ విజ్ఞానాన్ని సమగ్రపరచాలి
- గిరిజన యూనివర్సిటీలో ఢిల్లీ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ పీసీ జోషి



విజేతలైన విద్యార్థులతో వీసీ ప్రొఫెసర్ కట్టిమణి



ఢిల్లీ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ పీసీ జోషిని సత్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

విజయనగరం అర్బన్: శాస్త్ర పరిశోధన పరిజ్ఞాన విస్తరణలో సాంప్రదాయ విజ్ఞానాన్ని సమగ్రపరచాలని ఆ దిశగా శిక్షణలు అందించాలని ఢిల్లీ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ పీసీజోషి అన్నారు. స్థానిక కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలో 'విక్షిత్ భారత్ కోసం స్వదేశీ సాంకేతికతలు' అనే అంశంపై బుధవారం జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో సాంప్రదాయ విజ్ఞానంపై ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలు శిక్షణ పొందాలని అన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి మాట్లాడుతూ భారతీయ విజ్ఞాన వ్యవస్థ దేశ వ్యాప్తంగా విస్తరించాలని అన్నారు. ఈ అంశంపై డాక్యుమెంటరీ చేయడానికి సిద్ధం కావాలని అన్నారు. అందుకు అవసరమైన నిపుణులతో ఐకేఎస్‌పై చర్చా ధారావాహికంగా ప్రారంభిస్తుందని తెలిపారు. అనంతరం ముఖ్యఅతిథిని ఘనంగా సత్కరించారు. విభాగాధిపతి డాక్టర్ పి.శ్రీదేవి మార్గదర్శకత్వంలో బయోటెక్నాలజీ విద్యార్థులు రూపొందించిన పూల గైడ్‌ను ఆవిష్కరించారు. సైన్స్ డేని పురస్కరించుకొని ఇటీవల యూనివర్సిటీలో నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు జ్ఞాపికలు, ధ్రువపత్రాలను ముఖ్యఅతిథి అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ శరత్‌చంద్రబాబు, యూనివర్సిటీ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు టోకరా..

- గల్ఫ్ దేశాలకు పంపిస్తామని...
- ఒక్కొక్కరి నుంచి రూ.40 నుంచి రూ.60వేలకు పైగా వసూలు
- దందా అంతా ఆన్‌లైన్ ద్వారానే..
- రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు, కలెక్టరేట్‌లో అధికారులకు వినతి

విజయనగరం క్రైమ్: గల్ఫ్ దేశాలకు పంపిస్తామని వాట్సాప్‌లలో వచ్చిన మెసెజ్‌లకు, కరపత్రాలకు స్పందించిన కొంతమంది జిల్లాకు చెందిన నిరుద్యోగులతో పాటూ అధిక సంఖ్యలో ఒడిశాకు చెందిన వారు మోసపోయారు. దీనికి సంబంధించి బుధవారం రూరల్ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రూరల్ ఎస్‌ఐ ఆర్.వాసుదేవ్ అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ముడిదాం సమీపంలో ఉన్న హోండా షోరూమ్ సమీపంలో స్మశానానికి ఆనుకుని ఒక పాతబడిన ఇల్లు ఉంది. ఇంటి ఓనర్ ఓఎల్‌ఎక్స్‌లో అద్దెకు ఇస్తామని ప్రకటన ఇస్తే, దాని ప్రకారం ఆ యజమానికి ఫోన్ చేసి, ఆ ఇంటిని గుర్తు తెలియని వ్యక్తి అద్దెకు తీసుకున్నాడు. ఆన్‌లైన్ ద్వారానే ఇంటి అద్దె పేమెంట్ చేశాడు. అయితే లైఫ్ లైన్ ట్రావెల్ ఏజెన్సీ పేరుతో వాట్సాప్ ద్వారా గల్ఫ్‌లో పలు ఉద్యోగాలకు సంబంధించి ఇంటర్వ్యూలు చేస్తున్నట్లు ప్రకటించాడు. నిరుద్యోగులు ఆ కరపత్రాలను చూసి ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. అనంతరం వారంతా వారి ఊళ్లకు వెళ్లిన తర్వాత వారికి చాటింగ్ ద్వారా ఆఫర్ లెటర్లు పంపించి, విమాన చార్జీలు తదితర వాటితో పాటూ అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని నమ్మించి ఒక్కొక్కరి నుంచి రూ.40 నుంచి రూ.60వేల వరకూ వసూలు చేశాడు. ఆ తర్వాత రోజులు గడుస్తున్నప్పటికీ ఎటువంటి సమాచారం లేకపోవడంతో బాధితులు ఇంటర్వ్యూ జరిగిన ఇంటికి చేరుకున్నారు. అక్కడ తాళాలు వేసి ఉండడంతో తాము మోసపోయామన్న సంగతి వారికి అర్థమైంది. వెంటనే రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో ఉన్నత అధికారులకు తమ పరిస్థితిని వివరించారు. సుమారు తొమ్మిది మంది జిల్లా కేంద్రం నుంచి ఫిర్యాదు చేశారు. రూ.5 లక్షలకు పైగా మోసపోయామని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే ఒడిశాకు చెందిన నిరుద్యోగులు 50 మందికి పైగా ఉండవచ్చని చెబుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పూర్తి స్థాయి విచారణ చేపట్టామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ ఆర్.వాసుదేవ్ తెలిపారు.

మెటలర్జికల్ విద్యతో ఉద్యోగావకాశాలు అధికం

- జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య
- జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియం ప్రారంభం



సావనీర్‌ను ఆవిష్కరించిన వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: ఇంజినీరింగ్ విద్యలో మెటలర్జికల్ కోర్సులతో అధిక ఆదాయంతో కూడిన ఉద్యోగావకాశాలు అధికంగా ఉంటాయని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. స్థానిక జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో మెటలర్జికల్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియం 'ఐసెన్2కే24' సదస్సును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు జరుగుతున్న పరిశోధనా పరిజ్ఞానాన్ని పెంచుకుంటే మెటలర్జికల్ ఇంజినీరింగ్ విద్యతో ఉపాధి, ఉద్యోగాలు సులువుగా పొందవచ్చన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఆర్‌డీఓ హైదరాబాద్ సైంటిస్ట్–జీ డాక్టర్ ఎస్.కిషోర్‌నాథ్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యతో పాటు ఆయా కోర్ సబ్జెక్టులపై నైపుణ్యాలను కళాశాల స్థాయి నుంచి విద్యార్థులు పెంచుకోవాలని సూచించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న టాటా స్టీల్ లిమిటెడ్ ప్రోడక్ట్ టెక్నాలజీ గ్రూప్ జోనల్ హెడ్ డాక్టర్ ఎం.సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి సదస్సులకు విద్యార్థులు హాజరయి పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని కోరారు. అనంతరం మెటలర్జికల్ విభాగం రూపొందించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విభాగాధిపతి వి.మణికుమార్, ఫ్యాకల్టీ కో–ఆర్డినేటర్లు డాక్టర్ ఎ.శ్రీనివాసులు, బీఆర్ అంబేద్కర్, స్టూడెంట్స్ కోఆర్డినేటర్లుగా ఎ.పవన్‌మాధవ్, కె.ముఖేష్, ఆర్.పూర్ణిమ వ్యవహరించారు.